# నేను మొలకెత్తిన నేల

మేఘాలయ నన్ను తన చిరపుంజీ శిఖరం పైకెత్తుకుని, వో లోయ కొనలో నిలబెట్టి, దిగంతాల నుంచీ అగాధాలలోకి జారుతున్న మేఘాల తెరకేసి చూపెట్టి "నీముందున్నదంతా ఆకాశమేననడం పెద్ద మాయ. అక్కడ బ్రహ్మాండమైన పర్వత శ్రేణులూ, వాటిపై న్నుంచీ కిందికి దూకే జలపాతాలూ, మరికాస్త దృష్టిని ఆ చివరికేసి సారిస్తే బంగ్లాదేశపు కొంగులూ కనబడ్డమన్నదే సత్యం. యెక్కడి నీ కొండల తిరుపతి....? యెక్కడి మా మేఘాలయ చిరపుంజీ! .... మీ నిత్య గ్రీష్మవాసులంటే మా మేఘాలయకసలే వేడుక. పైగా నీ దగ్గరి నుంచీ వీస్తున్న శేషాద్రి కొండల గాలులు దానికి చక్కిలిగింతలు పెడుతున్నాయి. యీవేళ అది నిన్నేరకంగా కవ్విస్తుందో నాకే తెలియదు" అంది కొంటెగా.

పెరుగుతున్న పర్వతాలపైన, వాటిని ముంచెత్తడం కోసం పరవళ్ళు తొక్కుతున్న సముద్రంలా ఆకాశం పైకెగసి పడుతూ వచ్చి, వినయంగా ఆగిపోయిన శిఖరాల్ని చూసి, ప్రేమగా కరిగి ముందుకు దూకుతున్నట్టుగా లోయలోకి జారి మాయమై పోతోంది. ముసుర్లూ, చిత్తడి జల్లులూ, జడివానలూ, కుంభవృష్టులూ కలగలిసి చిరపుంజీ శిఖరాల పచ్చదనాన్ని పలచబారిస్తున్నాయి. శిఖరపు వాలుపైన నిల్చుని, ముందుకు దిగిన బూడిద రంగు మాయకేసి నిస్సహాయంగా చూస్తూ నిల్చున్నాను నేను.

తడిసి బరువెక్కిన తుంటరి గాలులు గిలిగింతలుపెడుతున్నాయి.

నీటి బిందువుల్ని మోయలేక సూర్యకిరణాలు కృంగిపోతున్నాయి. నా ముందున్న సువిశాలమైన బూడిద రంగు మాయలో వో మూలలో రంధ్రం పడుతున్నట్టుగా అనిపించింది. ఆకుపచ్చని అడవుల పైన్నుంచీ మేఘాలు కొన్ని పలచబడుతూ ముందుకు కదులుతున్నట్టుగా తోచింది. కళ్ళనిటు వైపుకు తిప్పేసరికి, అక్కడొక మేఘశకలం పాయలుగా విడిపోతూ సాగుతోంది. అనంతంగా పరుచుకున్న బూడిద రంగు మాయ క్రమంగా విడిపోతూ, ముక్కలు ముక్కలుగా పగిలిపోతూ, సోలుపులు సోలుపులుగా పక్కకు

సోలిపోతూ, నా రెండు కళ్ళ చూపుల పరిమితుల్ని సవాలు చేస్తూ, తనతో బాటుగా కాలాన్ని గూడా కరిగించసాగింది.

రకరకాల సంగీత వాయిద్యాలు చిత్రమైన రీతిలో మేళవించి పలికించే మాధుర్య సంగీతంలా, వివిధ రకాల మేఘాలు చిత్రమైన గతుల్లో విడిపోయి, నా ముందొక మహాద్భుత సౌందర్య దృశ్యాన్ని మోహరించాయి. నొప్పెట్టేలా మెడ పైకెత్తి చూస్తేగానీ శిఖరాల్ని కనిపించనివ్వని పర్వతాలూ, అవి తడిసి ఆరబెట్టుకుంటున్న తలవెంట్రుకల్లా చిక్కటి అడవులూ, అడవుల జడల్లో తురిమిన మొగలిరేకుల్లా జలపాతాలూ.... శిఖరాల పైకి తాపంతో దిగిన అకాశం లోంచీ జలజల రాలుతున్న చినుకులు.... చినుకుల్ని చిట్లించి యింద్రధనుస్సుల్ని విరిసిన సూర్యకిరణాలూ....

సుదీర్ఘ వర్ష సంతోషిణి చిరపుంజీ... కొండ శిఖరం పైన కొత్తగా మొలిచిన అనిమిష నేత్ర వృక్షంలా నేనూ...

యింతకంటే కావల్సిందేముందని? కాలమిలా ఆగిపోతే చాలునని... స్థల కాలాదుల్ని అధిగమించి, నిరంతర వర్ష డోలికల్లో వూగుతూ యిక్కడే శాశ్వతంగా వుండిపోవాలని....

రెండు క్షణాల తర్వాత నా గుండెలోంచీ సన్నటి పిలుపు వినవచ్చింది. ఆ పిలుపు క్రమంగా పెరుగుతూ, దీర్ఘాలాపనై నన్ను కమ్మేసింది. అనేక వసంతాలుగా అనురాగ రాగాల్ని శృతి చేస్తున్న నా అర్ధాంగి గొంతు చిరపుంజీ వర్ణచిత్రం పైకి మేఘమల్హార్ రాగాన్ని ప్రసారం చేస్తోంది. వెంటనే ఆమెను చిరపుంజికి రప్పించాను. కానీ పిల్లల కోడి గదా ఆవిడ! వొంటరిగా వస్తుందా మరి! నేనూ, రాగ విపంచిక నా శ్రీమతీ, మా అనురాగ స్పందనలు మా పిల్లలూ, యెదురుగా అనవరత వర్ష సంశోభిణి చిరపుంజీ... అనంతానంత ఆనందానంద సందోహంలో మేమూ....

చిరపుంజీ నీలాకాశాన్ని మెరుపుతీగొకటి నిలువునా చీల్చింది. మా యింటి ముంగిట నుంచీ నడచే సెలయేరులా సాగి, మోటరు పల్లకీలో వాలితే అర గడియలో వచ్చి పలకరించే మా పల్లెటూరి దారుల్నీ. స్థైర్యంగా పైకెగసిన కొండల మధ్య, ఆర్ద్రతతో దిగి వచ్చిన కోన లోపల, అమాయకత్వంతో ముడి వేసిన పూసుల్నీ, మా పూరింటిలో నా కోసం యెదురు చూసే నా ముసలి తల్లి చూపుల్నీ నా ముందు కదలాడించిందది. తక్షణమే మా యింటి ముంగిటి నుంచీ పాకే రహదారిని, మా కొండకోనల పల్లెటూరితో బాటూ, నా పూరింటి తల్లీతో సహా చిరపుంజికి తీసుకొచ్చేశాను.

నా చిటికెన వేలు పట్టుకుని యెవరో లాగుతున్నట్టుగా అనిపించడంతో తిరిగి చూశాను. నేనెంతో ముచ్చట పడి కట్టించుకున్న మూడు గదుల యిల్లు, నాకేసి మురిపెంగా

చూస్తూ నవ్వింది. అంతసేపూ దాన్ని మరచిపోయినందుకు దాని బుగ్గ గిల్లి అనునయిస్తూ దాన్నీ వందల మైళ్ళ కివతలికి, చిరపుంజీ కొండ సానువుల పైకి తరలించేశాను.

అటు మా పాత పూరింట్లో మా అమ్మా, యిటు కొత్త మేడలో మా ఆవిడా పిల్లలూ, రెండింటినీ కలుపుతూ కొండ నారవలా సాగే మా పురాతన రహదారీ, దానికో కొసలో కొండ కోనల పల్లెటూరూ, మరో కొసలో చిరంతన చిత్తడి వానల చిరపుంజీ.... పులకింతల పలవరింతల బృందగాన మాలపిస్తూ మేమంతా....

యింతలో చిరపుంజీ మేఘాల ఆకాశంలోంచీ పెద్ద కిరణపుంజ మొక్కటి పొడుచుకొచ్చింది. దాని తత్తళింపుల్లోంచీ యెన్నాళ్ళగానో నన్ను తన పొత్తిళ్ళల్లో పొదువుకున్న నా విశ్వవిద్యాలయపు వెలుగులు నా పైకి సోకాయి. జీవికనిస్తున్న మిషతో నా యవ్వన భావుకత్వాన్ని మోసిందీ. అన్నాలకూ అన్నదాలకూ నా పైన ప్రేమల్ని చిగురింపజేసిందీ, చిరకాలంగా నా అడుగుల సవ్వడులతో తన బాటల పాటల్ని శృతి చేసుకున్నదీ, దినానికి రెండుసార్లు నాకు తేనేటి మజిలీ కథల్ని వినిపించేదీ, నాలో పవళ్ళను వుదయింపజేసేదీ. నా రాత్రుళ్ళకు జోల పాటలు పాడేదీ... నా విశ్వవిద్యాలయం నేను లేకపోతే బోసిపోక యింకెలా వుంటుంది? దాని శాఖలనూ, ఆ శాఖలున్న తరువులతో బాటూ, గుమ్మజ్ గుమ్మటాల్లోవల మోగే భూత వర్తమాన వన్నెల గీతాలతో బాటూ నా విశ్వవిద్యాలయాన్నంతటినీ చిరపుంజికి తీసుకొచ్చుకునేశాను...

ఆనందంగా నేనూ, మా ఆవిడా, మా పిల్లలూ..మురిపంగా మా అమ్మా, నా పల్లెటూరూ, నా పురాతన వంపుసొంపుల రహదారీ... దేదీప్యమానంగా నా శాఖా తరుశోభిత, వర్ణ గీతికల విశ్వవిద్యాలయమూ.. సుందర నీరద వరదాయిని చిరపుంజీ... వర్ణ స్వర వన జుగల్ బందీల సంరంభంలో మేమూ....

నా భుజంపైన చల్లటి చేయొక్కటి నిలచింది. బాల్యం నుంచీ నాతో బాటూ పెరుగుతున్న నా బాల్యమిత్రుడు కరచాలనం చేస్తున్నాడు. వాడెప్పుడూ వాడి భార్య కొంగునే జెండాలా పట్టుకు తిరుగుతాడు. అందుకే వాడి వెనక, వాడి జెండా రెపరెపల వెనక, వాడి శ్రీమతి గూడా పలవరిస్తోంది. ఆవిడ చంకలో వొక యేడాదీ, పక్కనే మరో దశాబ్దీ వున్నాయి. వాళ్ళాడుకునే గొలుసుల చివర్లో వాళ్ళ యిల్లు కదులుతోంది.

చిరపుంజీ మేఘ కాసార శకటంలో మావాడికో గార్డు ఉద్యోగం తీసిచ్చి, మా యింటి పక్కనే వాడి యింటికీ తావిచ్చి, వాడిని వాడి సంసారంతో బాటూ చిరపుంజికి రప్పించుకున్నాను.

నేనూ, నా ప్రేమాతిశయాల యిల్లాలూ, పిల్లలూ, నా మురిపాల యిల్లూ, నా కొండకోన పల్లెటూరి మాతృమూర్తికేసి పరిగెత్తే వయ్యారాల రహదారీ. నా తేనీటి మజిలీ కథల వెన్నెల గీతికల విశ్వవిద్యాలయమూ, నా మిత్రుడూ, వాడి ప్రాపంచిక బంధనాల కుటుంబమూ, వాడి లౌకిక కార్యాలయమైన వాడి యిల్లూ, అమందానంద పారవశ్యంలో మేమందరమూ...

తొలి మేఘమొకటి చిరపుంజి పర్వత శిఖరం నుంచీ వొంటరిగా లోయలోకి జారుతోంది. చిరుమేఘాలు రెండు శిఖరపు నడుము దగ్గర దోబూచులాడుకుంటున్నాయి. గత కాలపు మెలకువ లోంచీ, వర్షాకాలపు రాత్రుల్లో పిల్ల మేఘాలతో సయ్యాట లాడే శేషాద్రి కొండల గడుసుదనం చటుక్కున నన్ను పలకరించింది. రెండే పవళ్ళ విరహం తర్వాత వూరు చేరుకుంటున్నప్పుడు, అల్లంత దూరం నుంచీ కొండంత వూరడింపుగా, నిలువెత్తు భరోసాగా నన్ను లాలించిన శేషాద్రి కొండల వేళ్ళు తనలో యెందాకా దిగాయో కనిపెట్టమని నా గుండె నన్ను సవాలు చేసింది.

ఆకాశపు మాయ సత్యమై నిలిచినట్టు, భూగోళపు మార్దవత నిత్యమై యెగసినట్టు, సృష్ట్యాదిలో జల దుర్గమొకటి ఘనీభవించి ఆగినట్టు, పురాణాల దావాగ్ని చల్లారి వెలిగినట్టు, శేషాద్రి కొండలు నిర్లిప్తంగా, యాంత్రికంగా, జలపాతాల జడలల్లుకుంటున్నాయి. వేసవిలో శిరోజాల్ని తొలగించుకుని కళ్యాణం చేసుకున్నప్పుడు అవి హుషారుగా నవ్వేవి. శిశిరంలో కొమ్మలు మొలిచినప్పుడు చిరునవ్వులు చిలికేవి. వసంతంలో లేత పచ్చ వస్త్రాల్ని చుట్టుకుంటూ సిగ్గులతో మొగ్గలయ్యేవి. వొకో వేసంగిని మూడు వందలా అరవై అయిదు వేసవులుగా విడగొట్టి, వొకో వేసవికి వొకో రకం యెండల రంగులద్ది, సుదీర్ఘ గ్రీష్మ తాపానికి ఆరు రుతువుల లేత అత్తరు పూతలు పూసి, రోజుకో కొత్త రుతువును రూపొందించుకునేటప్పుడు శేషాద్రి కొండలు యిప్పటిలాగాకుండా జాంజామ్మని వెలిగేవి.

జీవరాశిని కరుణించిన ప్రాణ వాయువొకటి పరవశించి పల్లవించినట్టు నిండుగా, దండిగా, పండుగలా శేషాద్రి కొండలు...

చిరపుంజీ నుంచీ హిమాలయ శ్రేణుల్ని తీసేసి, వాటి చోటులో నా శేషాద్రి కొండల్ని అమర్చేశాను.

నన్ను అలరించే నా శ్రీమతీ, నా పిల్లలూ, మమ్మల్ని దీవించే నా పల్లెటూరి రహదారీ, నా వూరింటి తల్లీ, నా జీవన గతుల్ని సవరించిన నా విశ్వవిద్యాలయ పీఠమూ, నా కోసమై యెక్కడికైనా వస్తాననే నా మిత్రుడూ. వాడినంటి పెట్టుకునే వాడి కుటుంబమూ,

మా వెనక నేపథ్యంగా శిలాతోరణ తురాయిలతో కళకళలాడుతూ శేషాద్రి కొండలూ.. సుదీర్ఘ వర్ష రుతు సందోహిని చిరపుంజీ... సతత హర్ష సంస్పదులం మేమూ...

కురుస్తోంది వర్షం హర్షేతి సిహాసంతో నిరంతరంగా...

సుదీర్ఘ సంతోష సుషుప్తిలో మేమంతా...

యేక్ తార వొకటి యధావిధిగా మోగుతోంది.

రాలుతున్న చినుకులూ, మూగుతున్న మబ్బులూ, సాగుతున్న మెరుపులూ, నిలదొక్కుకుంటున్న నవ్వులూ... పదే పదే అదే పాట పాడుతున్న యేక్ తారా...

చినుకులు రెండు వున్నట్టుండి సూదులై గుచ్చాయి. మబ్బుల వెనక మసక వెలుతురేదో పాకుతోంది. మెరవబోయి ఆగిన మెరుపులోంచీ నిస్ప్రాణంగా మూలుగొకటి దిగజారింది. రవళిస్తున్న నిశ్శబ్ద సంగీతాన్ని యేక్ తార కర్కశంగా చింపుతోంది.

నా శరీరంలోకి మెరుపేదో పాకింది. నా గుండెలోకి పిడుగేదో జారింది. నా మనస్సులో శిఖరమేదో కూలింది.

పొగ చూరిన వంట గదిలో నా భార్య కళ్ళు జీరబోయాయి. వాన కోట్ల కింద నక్కిన నా పిల్లలు పాచిబట్టి పోతున్నారు. యెప్పుడూ తడిగా, జడిగా, చిత్తడిగా, అలజడిగా, హోరుగా, బోరుగా వుండే చిరపుంజిలో మా యిల్లు ముక్కు చీదసాగింది. వానల్లో తడిసిన నా మిత్రుడి కార్యాలయం మొలకెత్తేసింది. తెరపి లేని వర్షాల్లో తడిసిన నా విశ్వవిద్యాలయ తేనేటి మజిలీల గుడారాలు కూలిపోయాయి. మా యింటి ముంగిటి నుంచీ మా పల్లెటూరి దాకా కొండనారవలా సాగే మా పాత బాట కడ్డంగా వాగులేవో ఆనకట్టలు కట్టేశాయి. మా వూరింటి అమ్మ చూపుల కడ్డంగా వానతెరలు దట్టంగా దిగిపోయాయి.

అయ్యో పాపమని నేను జాలిగా చూడగానే, నా చూపుల కర్థం తెలిసిపోయినట్టుగా శేషాద్రి కొండలు వెనక్కో అడుగేశాయి. పరవాలేదన్నట్టుగా నేను నవ్వగానే అవి వెనక్కు మరీ వెనక్కు బాగా వెనక్కు వెళ్ళిపోయాయి.

ఖాళీగా బోసిపోయిన చిరపుంజీ సానువుల దగ్గరికి మళ్ళీ రావడం కోసం హిమాలయాలు పొంచి చూడసాగాయి.

అంత దూరంలో ఆగిన హిమాలయాలను చూడగానే, అంతవరకూ, నా పాదాల దగ్గర ముఖం వేళ్ళాడేసుకుని వుండిపోయిన గడ్డిపూవొకటి, చాలాసేపటి తరువాత నీళ్ళలోకి పడిన చేప పిల్లలా కళకళలాడుతూ, నా చెవుల్లోకి సోకేలా తీయటి పాటను పాడనారంభించింది. నేనా మాధుర్యంలో తడిసి తల వూపగానే శేషాద్రి కొండలతో బాటూ

మా వూరి రహదారీ, మా వూరి రహదారితో బాటూ నా బిడియాల పల్లెటూరూ, మా పల్లెటూరితో బాటూ నా పూరింటి తల్లీ, నా పూరింటి తల్లితో బాటూ నా తేనీటి మజిలీ కథల విశ్వవిద్యాలయమూ, నా విశ్వవిద్యాలయంతో బాటూ నా చిన్ననాటి మిత్రుడూ, నా మిత్రుడితో బాటూ వాడి లౌకిక బంధనాల సంసారమూ, వాడి యింటితో బాటూ నా మురిపాల యిల్లూ, మా యింటితో బాటూ నా సహధర్మచారిణి నా భార్యా, నా భార్యతో బాటూ నా భావి విధాతలు నా పిల్లలూ, వెనక్కు మైదానాలను వెతుక్కుంటున్నట్టుగా, పీఠభూముల్ని పలకరిస్తున్నట్టుగా, బాగా వెనక్కు వెళ్ళిపోయారు.

యెండల కొలనులో విరిసే పర్వత పుష్పాల్లా శేషాద్రి కొండల్ని పరిమళింపజేయడం కోసం, మా పల్లెటూరి దాకా నడిచే కొండ నారవలాంటి రహదారిని ఆపలేని జలపాతంలా మార్చడం కోసం, మా పల్లెటూరిని యెప్పటికీ అడవుల్లో దాగిన కొండమల్లెలా గుభాళింపజేయడం కోసం, మా పూరింటి అమ్మ చూపులకు వేడి వెలుతురులద్దడం కోసం, మా విశ్వవిద్యాలయ తేనీటి మజిలీ కథలకు అధునాతన శిల్ప రీతుల్ని నేర్పడం కోసం, నా మిత్రుడి యింటిలో సహానుభూతిని రగిలించడం కోసం, మా యింటిని పురాతన పాంథశాలగా మలచడం కోసం, నా పిల్లలకు రాగాల రెక్కల్ని తగిలించడం కోసం, నా భార్యలో సర్వసత్తాక, స్వతంత్ర గీతికను పలికించడం కోసం, యేక ఋతు హర్షిణి చిరపుంజికి వీడ్కోలు చెప్పక తప్పదని చెప్పేశాను.

చిరపుంజికీ బ్రహ్మపుత్రకూ మధ్య, బ్రహ్మపుత్రకూ గంగకూ మధ్య, గంగకూ నాగావళికీ మధ్య, నాగావళికీ గోదావరికీ మధ్య, గోదావరికీ కృష్ణకూ మధ్య, కృష్ణకూ పెన్నకూ మధ్య. పెన్నకూ కళ్యాణికీ మధ్య, వుండవలసినంత దూరాన్ని జాగ్రత్తగా సవరిస్తూ, సాధారణంగా వ్యాకోచించే సమయాన్ని బుజ్జగించి సంకోచింప జేస్తూ తిరిగొచ్చాను.

మా వూరికి వస్తూండగా అల్లంత దూరం నుంచే కొండంత వూరడింపుగా, నిలువెత్తు భరోసాగా మా శేషాద్రి కొండలు లాలించాయి. శాఖలు చాపుకుంటూ, భూత వర్తమాన గీతికల్ని పాడుకుంటూ, మా విశ్వవిద్యాలయం కొత్తగా నేర్చుకున్న కథల్ని చెప్పసాగింది. మా యింటి దగ్గరి నుంచీ మా పల్లెటూరి దాకా కొండనారవలా సాగుతున్న మా పాత బాటా, పూరింట్లోని మా అమ్మ చల్లని చూపులూ నన్ను వూరడించాయి. తన పాత యింటికి కొత్త ముస్తాబు చేసుకుంటున్న నా మిత్రుడూ, అతడి కుటుంబమూ నవ్వుతూ నన్ను ఆహ్వానించారు. నా పిల్లలతో బాటూ మా యింటి లోంచీ బయటికొచ్చిన నా శ్రీమతి, చిరుకోపంతో నా చెంప చరిచి, చిరపుంజీ చినుకులతో తడిసిన నా తలను తన కొంగుతో

తుడవసాగింది. చిరపుంజీ కొండ సానువుల గడ్డిపూల పాటతో శృతి కలుపుతూ నా గొంతు లోంచీ మధుర గీతమొకటి పెల్లుబికింది.

నా భుజం చరచుకున్నాను హుందాగా - యెక్కడ వుండవలసిన వాటిని అక్కడే వుంచినందుకు, నేను పుట్టవలసిన చోటే పుట్టినందుకు, నేనుండవలసిన చోటే వున్నందుకు, నా బతుకు నాదే అయినందుకు, నన్ను నేను అభినందించుకునే అవకాశం దొరికినందుకు....

11-9-2011 వార్త ఆదివారం